విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అవగాహనపై ర్యాలీ

విశాలాంధ్ర-గణపవరం: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్ 2023, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమములలో భాగంగా ఆదివారం అన్ని గ్రామ పంచాయతీల వద్ద ర్యాలీ నిర్వహించినట్లు ఈవోపీఆర్డీ పల్లి వెంకటసత్యనారాయణ తెలిపారు. సెంట్రల్ టీమ్ వారిచే జిల్లాలోని అన్నీ మండలములలో రంధం చెకింగ్ రెండు లేదా మూడు రోజులలో చేయబడునని జిల్లా పంచాయితీ అధికారి జివికె మల్లిఖార్జునరావు ఆదేశాల మేరకు అన్నీ గ్రామంలు పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దుటకు ప్రజలందరికీ తడి - పొడి చెత్త ఇంటి వద్ద పారిశుధ్య కార్మికులకు వేరు చేసి ఇచ్చుటకు ,అందరు వ్యక్తి గత మరుగుదొడ్లను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి గద్దల జ్యోతిర్మయి ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ హరినాథ్ రాజు సర్పంచులను ఆదేశించినట్లు తెలిపారు.

'108' యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఏలూరు జిల్లా 108 ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఇబ్బా ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రసాద్ ఉంగుటూరు మండలం రాచూరు గ్రామానికి చెందిన వ్యక్తి. నూతన అధ్యక్షుడు ప్రసాద్‌ను 108 సిబ్బంది, సిఐటియు నాయకులు, గ్రామస్తులు పూలమాలవేసి అభినందించారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జిల్లాలోని 108 అంబులెన్స్ సిబ్బంది అందరికీ ప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉంగుటూరు 108 అంబులెన్స్ సిబ్బంది ప్రసాద్‌ను కలుసుకుని అభినందించారు.

వైసీపీ నేతలను కలిసిన వట్టి

విశాలాంధ్ర-ఉంగుటూరు: దివంగత మాజీ మంత్రి వట్టి వసంత్ కుమార్ రాజకీయ వారసుడు పవన్ కుమార్ రాబోయే ఎన్నికల్లో ఉంగుటూరు నుండి పోటీ చేయడానికి ఆదివారం పలువురు ప్రజా ప్రతినిధులను, రాజకీయ నాయకులను కలుసుకున్నారు. కైకరంలో జడ్పీటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మిని, ఏలూరు జిల్లా వైఎస్ఆర్సిపి పంచాయతీరాజ్ సెల్ అధ్యక్షుడు పుప్పాల గోపి, ఎంపీటీసీ సభ్యులను కలుసుకున్నారు. అలాగే ఉంగుటూరులో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏలూరు జిల్లా చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు దొంతం శెట్టి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, మాజీ దేవస్థానం చైర్మన్ దూసనపూడి లక్ష్మీనారాయణ, ఆటో యూనియన్ సభ్యులను కలుసుకున్నారు.

గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-టీ నరసాపురం: కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ విమర్శించారు. కేతవరంలో తెల్లదోమ సోకిన కొబ్బరి తోటను ఆదివారం ఆయన పరిశీలించారు. కొబ్బరికి నల్లి తెగులు, తెల్ల దోమ తెగుళ్లు సోకి దిగుబడి లేక కొబ్బరి రైతు కుదేలైనాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి ఆయన డిమాండ్ చేశారు. వెలిది గంగాధర రావు, లింగారెడ్డి శ్రీనివాస రావు, కంచర్ల సత్యం బాబు, ఘంటా సతీష్, పెండ్యాల ప్రసాద్, ఆచంట గోపాల రావు, బేతిన వెంకట్రావు, కాసన్నేని వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో దేవాదాయశాఖ కమిషనర్

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వెంకన్నను దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ దర్శించుకున్నారు. ఈఓ వేంద్ర త్రినాధ రావు స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు రాంబాబు బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రదక్షిణలు అనంతరం స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి ముఖమండపంలో ఆలయ వేదపండితులు వేద ఆశీర్వచనాలు పలికారు. ఆలయ ఈవో కమిషనర్‌కు స్వామి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

విశాలాంధ్ర-వేలేరుపాడు: వరద ప్రభావిత వేలేరుపాడు మండలంలో ఆదివారం సబ్ కలెక్టర్ అదర్ష్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీవో ఝాన్సిరాణి పర్యటించారు. ఏద్దువాగు వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. అక్కడ వున్న బోట్లలో తప్పని సరిగా లైఫ్ జాకెట్స్ ఉంచాలని ఆదేశించారు. వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పడమటి మెట్ట, కొత్తూరు, తూర్పు మెట్ట ప్రాంతాల్లో పర్యటించారు. వరద సాధారణ పరిస్థికి వచ్చే వరకు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలన్నారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి శివ పిలుపునిచ్చారు. కొయ్యలగూడెంలో ఆదివారం వివిధ విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనేక విద్యారంగ సమస్యలపై విద్యా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రవ్యాప్త బందుకు ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని శివ కోరారు. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి దిలీప్, టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి పారేపల్లి పవన్, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ల వద్ద జనరేటర్ సిద్ధం

విశాలాంధ్ర కుక్కునూరు: వరద పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని కుక్కునూరు సెల్‌ఫోన్ టవర్ల వద్ద అత్యవసర సమయంలో వినియోగం నిమిత్తం బిఎస్ఎన్ఎల్ సంస్థ 7.5 సామర్థ్యం గల జనరేటర్‌ను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. సమాచార వ్యవస్థకు ఎటువంటి అంతరాయం లేకుండా చేసేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-తణుకు: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, షరతులు లేకుండా అమ్మఒడి పథకాన్ని కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంత మందికీ మంజూరు చేయాలని తదితర డిమాండ్ల సాధనకు ఈనెల 25న జిల్లాలో జరిగే కేజీ టు పీజీ విద్యా సంస్థల బంద్‌కు తణుకు నియోజక వర్గంలో ఉన్న విద్యాసంస్థల అధినేతలందరూ సహకరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి, తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు గంటా పవన్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు రాజేష్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం తణుకు ఎస్‌సిఐఎం డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల పరిస్థితి కడుదయనీయంగా ఉందని నాయకులు అన్నారు. వసతి గృహాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, వసతి గృహాల లో ఖాళీగా ఉన్న కుక్కు, కమాటి పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజుల దోపిడి అరికట్టాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు మెగా డీఎస్ సి నిర్వహించాలని తదితర డిమాండ్ల

సాధనకు 25న జరిగే విద్యా సంస్థల బంద్ కు తణుకు నియోజక వర్గంలో ఉన్న విద్యా సంస్థల అధినేతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరాడ శివ, యశ్వంత్, జీ బాలు, యు మురళి పాల్గొన్నారు.

జిల్లాలో జగనన్న సురక్ష విజయవంతం: కలెక్టర్

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని, కార్యక్రమంలో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న 11 రకాల సర్టిఫికెట్లలో ప్రజలు కోరుకున్న సర్టిఫికెట్లను సకాలంలో అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఈనెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 476 సచివాలయాల పరిధిలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలలో 4,52,675 సర్వీసులకు నమోదు చేయగా, 4,44,787 సేవలు అందజేసినట్లు, 499 అర్జీలు సరైన ఆధారాలు లేనందున తిరస్కరించినట్లు తెలిపారు. అలాగే 7,389 సేవలు అధికారుల పరిశీలనలో ఉన్నట్లు ఆమె తెలిపారు. జూలై 1 నుంచి 22వ తేదీ వరకు జిల్లాలో జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 1,66,031, ఆదాయ ధృవీకరణ సర్టిఫికెట్లు 1,62,364, ఆధార్ కు మొబైల్ నెంబర్ అప్డేషన్ 5,168, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు 325, కొత్త రేషన్ కార్డులు, రైస్ కార్డుల స్ప్లిట్టింగ్ కు 1,924, మ్యుటేషన్లు 204, హౌస్ హెూల్డ్ నుంచి వివాహమైన వారిని వేరు చేయుటకు 297, వివాహ ధ్రువీకరణ సర్టిఫికెట్లు 93, సిసిఆర్ కార్డులు 5,270, జనన ధ్రువీకరణ పత్రాలు 297, మరణ ధ్రువీకరణ పత్రాలు 377 జారీ చేసినట్లు తెలిపారు. వాలంటీర్ల ద్వారా సర్వే చేయించి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను సచివాలయాల ద్వారా సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేని, అర్హత లేని సర్టిఫికెట్లను విచారించి అర్హత ఉంటే అందిస్తున్నామని, లేకపోతే లబ్ధిదారుడికి కారణాలు చెప్పి తిరస్కరిస్తున్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈనెల చివరి వరకు జరిగే సురక్ష శిబిరాల్లో 11 రకాల సర్టిఫికెట్లను అందించేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

నగర కార్పొరేషన్ అవినీతిమయం

విశాలాంధ్ర-ఏలూరు: ఇటీవల డిప్యూటీ కమిషనర్‌గా రాధ అనే అధికారి బాధ్యతలు స్వీకరించిన తరువాత జరిగిన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ను కోరుతున్నట్లు టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) తెలిపారు. స్థానిక పవర్ పేటలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పొద్దుటూరులో ఒక హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాధ అనే మహిళా అధికారిని ఏలూరు డిప్యూటీ కమిషనర్ గా తీసుకువచ్చారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, కమిషనర్, డిప్యూటీ కమిషనర్లపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖ లేకుండా డిప్యూటీ కమిషనర్ రాధ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ పోస్టింగ్ వెనుక కూడా భారీ ఎత్తున డబ్బులు చేతులు మారాయని ఆయన విమర్శించారు. డిప్యూటీ కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె తరపున ఆమె బంధువు చంద్రశేఖర్ మధ్యవ్యక్తిగా వ్యవహరిస్తూ కార్పొరేషన్ లోని ఏఈలు, డి ఇ లకు ఫోన్లు చేస్తూ, వారిని బెదిరింపులకు గురి చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. ఈ విధంగా డిప్యూటీ కమిషనర్ వసూలు చేసిన డబ్బులు ఏలూరు ఎమ్మెల్యే కి వెళ్ళాయా లేక కమిషనర్ కి వెళ్లాయా ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారాలన్నింటిలో ఏలూరు ఎమ్మెల్యే పాత్ర ఎంత, కమిషనర్, డిప్యూటీ కమిషనర్ల హస్తం ఏ మేరకు ఉంది తదితర అంశాలపై పూర్తిస్థాయి విచారణ జరగాలని బడేటి చంటి డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాలన్నింటిని జిల్లా కలెక్టర్ దృష్టికి సాక్ష్యదారాలతో తీసుకువెళ్లి విచారణ చేయించమని కోరతామని ఆయన స్పష్టం చేశారు. చోడే వెంకటరత్నం,జాలా బాలాజీ ,వందనాల శ్రీనివాసరావు, తంగిరాల సురేష్, పెద్దిబోయిన శివప్రసాద్,గూడవల్లి శ్రీనివాస్, బౌరోత్ బాలాజీ, రెడ్డి నాగరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

విశాలాంధ్ర-లింగపాలెం: ఉపాధి పథకం ద్వారా ఉద్యాన పంటలు పండించే రైతులు ఆర్థిక పరిస్థితిని పరిశీలించేందుకు ఉపాధి పథకం ఉద్యాన పంటల విభాగం డిప్యూటీ కమిషనర్ డాక్టర్ లీలావతి ఆదివారం భోగోలులో పర్యటించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఈమె ఉద్యాన పంటలు పండిస్తున్న రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఉపాధి పథకం ద్వారా వస్తున్న సహకారం, ప్రోత్సాహంతో జీడిమామిడి, మామిడి, పామాయిల్, నిమ్మ తదితర ఉద్యాన పంటలు పండిస్తున్నామని రైతులు తెలిపారు. గతంలో సంప్రదాయ పంటలు మాత్రమే పండించటం జరిగేదని, లాభనష్టాలతో నిమిత్తం లేకుండా ఒకే విధమైన పంటలు పండించే వాళ్ళమని అన్నారు. ఉపాధి పథకం వల్ల ఉద్యాన పంటలను పండిస్తున్నామని తెలిపారు. ఈపంటలు తమ జీవన విధానానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవటానికి ఉపయోగపడుతున్నాయని వివరించారు. కొన్ని సందర్భాలలో గిట్టుబాటు ధర ఉండటంలేదని, దళారీల హవా సాగుతుందని తెలిపారు. ఉపాధి పథకంలో ఉద్యాన పంటలు వేసే వారు సన్న చిన్నకారు రైతులమని, దళారీల హవా లేకుండా గిట్టుబాటు ధర వచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నిమ్మ పండించే రైతులు అన్నారు. రైతుల అభిప్రాయాలను ఈమె తెలుసుకున్నారు. రెండు రోజులు పాటు నూజివీడు క్లస్టరులో ఈమె పర్యటించారు. ఈమెతోపాటు క్లస్టరు ఎపీడి లక్కపాం శ్రీనివాస్, డ్వామా ఉద్యాన పంటల పర్యవేక్షకురాలు వెంకటలక్ష్మి, లింగపాలెం మండల ఏపీఓ వరలక్ష్మి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రాంబాబు, క్షేత్రస్థాయి సహాయకులు ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మేలైన సేవలు

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం: సచివాలయ వ్యవస్థ ద్వారా మేలైన సేవలు అందిస్తున్నామని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. ఆదివారం మండలంలోని గురవాయిగూడెంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ సచివాలయ ద్వారా ప్రజా పాలనను ప్రజల ముందకే తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఆయన అన్నారు. జెడ్పీటీసీ బాబ్జీ,ఎంపీపీ కొదమ జ్యోతి, స్త్రీ శిశు సంక్షేమ రీజనల్ చైర్ పర్సన్ వందనపు సాయి బాల పద్మ, సర్పంచ్ గుబ్బల సత్య వేణి,ఎంపీపీ కొదమ జ్యోతి మండల ప్రెసిడెంట్ వాంసెట్టి హరిబాబు వైసీపీ నాయకులు బత్తిన చిన్నతదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరుడిని దర్శించుకున్న హైకోర్టు జస్టిస్

విశాలాంధ్ర-భీమవరం టౌన్: భీమవరం గునుపూడి పంచారామ క్షేత్రం శ్రీసోమేశ్వర జనార్ధన స్వామిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాలకృష్ణారావు దర్శించుకుని పూజా కార్యక్రమాలు చేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు కూర్మ దాసు సత్య శ్రీనివాస్, నల్లం రఘుబాబు, లక్కు త్రిమూర్తులు, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ, వి.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

జడ్పీ చైర్పర్సన్‌కు సన్మానం

విశాలాంధ్ర-ఏలూరు: నగరంలో ఏలూరు నగర కొప్పుల వెలమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా నూతనంగా ఎన్నికైన ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు భీమవరపు పాపారావు అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీత ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ మన కులానికి రాష్ట్రం లో ఒక ఉప ముఖ్యమంత్రి, తొలిసారి గోదావరి జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్పెర్సన్ గా అవకాశమిచ్చిన జగన్ కు కృతజ్ఞతలు తెలిపారు. మనం ఉన్నత చదువులు పిల్లలను చదివించాలని విద్య ద్వారానే విజయాలు సాధ్యమని రేపటి తరాలు ఐఏఎస్, ఐపీఎస్ తదితర సర్వీసులకు ఎంపిక కావాలని, డాక్టర్లు ఇతర వృత్తి కోర్సులలో రాణించాలని కోరారు. వైసిపి బి సి సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాద రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గడచిన విద్యా సంవత్సరంలో విశేష ప్రతిభ చూపిన విద్యార్థిని, విద్యార్థులకు ఏలూరు నగర కొప్పుల వెలమ సంఘం వారిచే ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీమంత్రి మరడాని రంగారావు, ముదేడ్ల రంగారావు, అల్లు ఉమా మహేశ్వరరావు, అర్నేపల్లి మదు ,బల్లా శివ ,మారడాని అచ్యుత రావు ,కునిరెడ్డి శ్రీనివాస్ , సంబంగి రావు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌పై కన్ను?

విశాలాంధ్ర-చాట్రాయి: చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో ఏం జరుగుతుంది అనే దానిపై పలువురి కళ్లు పడుతున్నాయి. సమాచార హక్కు చట్టమే వారికి ఆయుధం అయింది. మండల పరిషత్ లో పెరుగుతున్న నియంతృత్వం పై వైసిపి అంతర్గతంగా నివురు గప్పిన నిప్పులా వుందని పలువురు అంటున్నారు.పైకి చెప్పుకోలేకపోయినప్పటికీ లోలోపల ఉడికిపోతున్నారని వినవస్తుంది. గడచిన నాలుగేళ్లుగా టిడిపి మండల నేతలు ఎవ్వరు మండలంలో ఏం జరుగుతుందో పట్టించుకోకపోయినప్పటికీ కన్నెత్తి చూడనప్పటికీ షుమారు గత వారం రోజుల క్రితం నూజివీడు నియోజకవర్గ ఇన్చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సమాచార హక్కు చట్టంలో అనేక అంశాలను సమాచారం కోరినట్లు తెలిసింది. ప్రభుత్వం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న సంక్షేమ పథకాలు పింఛన్ల వివరాలు అదేవిధంగా అభివృద్ధి కార్యక్రమాలు ప్రతీ అంశాన్ని లెక్కలతో క్షుణ్ణంగా ఇవ్వాలని అడిగినట్లు తెలుస్తోంది. మండలంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ఒంటెత్తు పోకడలు పెరుగుతున్నాయని ఏకవాక్య పాలన సాగుతోందని దళిత గిరిజన మహిళా బడుగు బలహీన వర్గాల ప్రజా ప్రతినిధులకు కనీసమైన గౌరవం లేకుండా పోతుందని పలువురు చర్చించుకోవడం గమనార్హం. ఎంపిపి కి కనీసం గుర్తింపు ఇవ్వడంలేదని దళిత సంఘాల నేతలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. దీనిపై ఎంపీడీవో దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలో ముద్దర బోయిన వెంకటే శ్వరరావు సమాచారం కోరిన విషయం వాస్తవమే అన్నారు. మరికొందరు కూడా అనేక అంశాలపై సమాచారం అడుగుతున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

విశాలాంధ్ర-భీమవరం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ అవగాహన సదస్సు, ప్రతిజ్ఞ నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ జి శ్యామల మాట్లాడుతూ బాల్యం నుంచి మొక్కలు నాటడంపై అవగాహన కల్పించినప్పుడే సంపూర్ణంగా పర్యావరణన్ని కాపాడుకోవచ్చునన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, గంటా సుందర కుమార్, ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ మొక్కలు దత్తత తీసుకున్న విద్యార్థులకు సంపూర్ణంగా పెంచితే బహుమతులు అందజేస్తామన్నారు. హాస్టల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

తెలుగు మహిళా పట్టణ అధ్యక్షురాలుగా దుర్గాదేవి

విశాలాంధ్ర- కొయ్యలగూడెం: టీడీపీ కొయ్యలగూడెం పట్టణ మహిళా అధ్యక్షురాలిగా దొడ్డపనేని దుర్గాదేవిని నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణారావు తెలిపారు. రామకృష్ణారావు ఇంటి వద్ద ముఖ్య నాయకుల సమావేశానికి హాజరైన నియోజకవర్గ ఇంచార్జ్ కన్వీనర్ బోరగం శ్రీనివాస్ ను ఆమె మర్యాదపూర్వకంగ కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పలు సూచనలను శ్రీనివాస్ ఆమెకు తెలిపారు. రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాలదేవి, బెల్లాన శ్రీనివాస్, పూలపల్లి భద్రయ్య, వెంకటరమణ, బాలిన రాఘవ పాల్గొన్నారు.

వాహనచోదకులకు హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర-భీమవరం టౌన్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి ప్రమాదాల బారిన రక్షించుకోవాలని భీమవరం ట్రాఫిక్ సీఐ దాసు అన్నారు. ఆదివారం రెండో పట్టణంలోని అడ్డవంతెన సమీపంలో హెల్మెట్ లేకుండా నడిపే ద్విచక్ర వాహనదారులను నిలుపుదల చేసి హెల్మెట్ ధరించడం వలన కలిగే లాభాలు గూర్చి వివరించి హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా పట్నానికి వచ్చే వాహనాలు నిలుపుదల చేస్తామన్నారు. ఎస్సైలు, పలువురు కానిస్టేబుళ్లు ఉన్నారు.

మణిపూర్ ఘటన కేంద్రం అసమర్థతే

విశాలాంధ్ర-కామవరపుకోట: కేంద్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా మణిపూర్ ఘటనలు సంభవిస్తున్నాయని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు, సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మణిపూర్‌లో వృద్ధులు అని చూడకుండా దాడులు చేస్తున్న అరాచక శక్తులు బరితెగించి 80 ఏళ్ల వృద్ధురాలు ఇంటికి నిప్పు పెట్టి సజీవ దానం చేసినా ప్రధాని మోడీ తనకేమీ పట్టనట్లు ఉండటం అమానుషం అని విమర్శించారు. ఈ దాడులు నిరసిస్తూ ఈ నెల 25వ తేదీన జరిగే నిరసన ప్రదర్శనలో సిపిఐ శ్రేణులు మహిళలు ఇతర ప్రజా సంఘాలు పాల్గొని మణిపూర్ లో జరుగుతున్న దాడులను తీవ్రంగా విజ్ఞప్తి చేశారు.

ముంపు ప్రాంతాల్లో ఐటీడీఏ పీఓ పర్యటన

విశాలాంధ్ర-కుక్కునూరు: కుక్కునూరు మండలంలో ఆదివారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ విస్తృతంగా పర్యటించి వరద పరిస్థితిని పరిశీలించారు. మంచినీటి బోర్లు పనితీరుని పరిశీలించారు. వైద్య శిబిరాలలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. దాచారం గ్రామంలో వరద ముంపు గ్రామాలలోని ప్రజలను పూర్తిగా ఆదుకుంటామన్నారు. తాగునీటికి ఎటువంటి కొరత లేకుండా మంచినీటి బోర్లు ఏర్పాటు చేశామన్నారు. వరద సమయంలో ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్య సేవలు అందించేందుకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామనీ, ఆ వైద్య శిబిరాల వద్ద 20 రోజులకు సరిపడా మందులు నిల్వ ఉంటాయని, ముఖ్యంగా పాముకాటు నివారణకు మందులు సిద్ధం చేశామన్నారు. కుక్కునూరు మండలం దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన వరద పునరావాస కేంద్రంలో మంచినీటి బోర్లా పనితీరును పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వైద్య సేవలను అందించడానికి 108 వాహనములు సిద్ధం చేశామని తెలిపారు. వైద్య శిబిరాలలో టైఫాయిడ్,మలేరియా, డెంగు అత్యవసర మందులు కూడా శిబిరాల్లో ఉంచామన్నారు. వరద ముంపు ప్రాంతాలలో ఉన్న గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు తెలిపారు. పీఓ వెంట రెవిన్యూ, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీకేఎంయూ మహాసభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెంటపాడు: ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెయంయు) పశ్చిమగోదావరి జిల్లా 25వ మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెయంయు) పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గత 86 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసి లక్షలాది ఎకరాల భూమిని పేదలకు సాధించిపెట్టిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, ఉండి, కాళ్ల మండలాల్లో వేలాది ఎకరాలు సిఐడి కార్పొరేషన్ భూములను పేదలకు సాధించి పెట్టడం కోసం సిపిఐ, బికెయంయు ఎన్నో పోరాటాలు నిర్వహించాయన్నారు. ఈ జిల్లా మహాసభకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, బీకేఎంయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సనపల శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాలికల వసతి గృహంపై ప్రత్యేక నిఘా

విశాలాంధ్ర-కైకలూరు: ఆటపాకలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కైకలూరు ఎస్ఐ ఆకుల రఘు ఆదివారం సందర్శించారు. సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో భద్రతాపరమైన అంశాలలో తీసుకుంటున్న చర్యలను గురించి ప్రతి ఒక్క విద్యార్థినిని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వార్డెన్ నాగమణితో మాట్లాడుతూ హాస్టల్లోని విద్యార్థినులను ఎప్పుడైనా బయటకు పంపించే సమయాలలో వారి తల్లిదండ్రులు, సంరక్షకులు తప్ప బాలికలను ఎవరు వచ్చినా మాట్లాడించ వద్దు వారిని వారితో పంపించ వద్దు అని, హాస్టల్ లో భద్రతాపరమైనటు వంటి అంశాలలో ఏ విధమైన సహాయ సహకారాలు కావాలన్నా పోలీసు వారు వెంటే ఉంటారని తెలిపారు. బీ. వెంకటరత్నమ్మ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పాల్గొన్నారు.

తమ్మిలేరు ఎడమ కాలువకు నీరు విడుదల

విశాలాంధ్ర- లింగ పాలెం: తమ్మిలేరు రిజర్వాయరు నీటిని ఎడమ కాలువకు విడుదల చేశారు. తెలంగాణలో అధిక వర్షాలు పడుతుం డటంతో రిజర్వాయరు లోకి నీరు చేరే అవకాశం ఉందని, దీనిని పరిగణనలోకి తీసుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తమ్మిలేరు డిఇ బి.శ్రీనివాస్ వెల్లడించారు. తమ్మిలేరు రిజర్వాయరులో నీటి సామర్థ్యం 354 అడుగులు కాగా ప్రస్తుతం 338.4 అడుగుల నీరు ఉంది. రిజర్వాయరులోకి 350 అడుగులు నీరు చేరితే కిందకు విడుదల చేస్తారు. అయితే తెలంగాణ నుంచి వరద నీరు అధికంగా వస్తుండటంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రిజర్వాయరులోకి ఎంత నీరు వస్తుందో 48 గంటలు గడిస్తే తెలుస్తుందని డిఇ ఆదివారం తెలిపారు. ఇదిలా ఉంటే చింతలపూడి, లింగపాలెం మండలంలో తగినంతగా వర్షాలు పడకపోవటంతో వరినాట్లు ఆలస్యమవుతాయని రైతులు ఆందోళనతో ఉన్నారు. సకాలంలో నాట్లు వేయటానికి రిజర్వాయరు ఆయకట్టుకు నీటిని విడుదల చేయా లని కోరుతూ ఉన్నారు. రిజర్వాయరు ఆయకట్టు ఎడమ కాలువకు ఆదివారం విడుదల చేసిన నీరు చింతలపూడి మండలం ఎర్రంపల్లి మీదుగా లింగపాలెం మండలం యడవల్లి నుంచి సరఫరా అవుతుంది.

జక్కంపూడి ఓటమికి కృషి

విశాలాంధ్ర-రాజానగరం: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఓటమికి తామంతా కృషి చేస్తామని పలువురు వైసీపీ మండలం రెబెల్ నాయకులు అన్నారు. మండలంలోని పుణ్యక్షేత్రం గ్రామంలో సీనియర్ నాయకులు పేపకాయల విష్ణుమూర్తి నివాసంలో మండలంలోని సీనియర్ వైసీపీ రెబల్ నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జక్కంపూడి రాజాను చిత్తు చిత్తుగా ఓడించి డిపాజిట్లు గల్లంతు అయ్యే విధంగా మనం అందరం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. జక్కంపూడి కుటుంబం చేసిన మోసాలను ప్రజలు అందరికీ వివరిస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రెబల్ నాయకులు దేశలశ్రీను, పెంటగట్ల రాజబాబు, పేపకాయల విష్ణు మూర్తి, పల్లకడియం కృష్ణ, మునేశ్వరరావు, పెమ్మనబోయిన చంద్ర శ్రీను, రాజానగరం మండలం వివిధ గ్రామాల నుండి వైయస్సార్ కాంగ్రెసు పార్టీ రెబల్ నాయకులు పాల్గొన్నారు.

రక్షకభట నిలయానికి సొంత భవనం కరువు

విశాలాంధ్ర-పెనుమంట్ర: ప్రజలకు రక్షణ కల్పించవలసిన రక్షక భటులకు విధులు నిర్వహిస్తూ బిక్కుబిక్కుమంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఏ నిమిషానికి ఏమి జరుగునో తెలియని పరిస్థితి నెలకొంది. కనీస సదుపాయాలు లేక అష్ట కష్టాలు పడుతున్నారు. పెనుమంట్ర మండలంలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం కేవలం కాగితాలకే పరిమితమైపోయింది. ప్రారంభం నుంచే అద్దె భవనంలో నడచిన పోలీస్ స్టేషన్ సుమారుగా 10 ఏళ్ల క్రిందట విద్య శాఖకు చెందిన కాళీ భవనంలోనికి మార్చారు. ఆనాటి నుండి పోలీస్ స్టేషన్ అందులోనే నేటి వరకు కొనసాగుతుంది. నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి వివిధ ప్రాంతాల్లోని స్థలాలను ప్రతిపాదించిన అడుగు కూడా ముందుకు పడలేదు. వర్షం కురిసిందంటే చాలు సిబ్బందిలో వణు కే.. స్లాబ్ నుంచి నీరు కారణంతో రికార్డులు తడిసిపోతాయేమోనని సిబ్బంది భయపడుతున్నారు. రాత్రులయితే సెంట్రీ బిక్కుబిక్కు అంటూ గడపాల్సిందే... స్టేషన్ సిబ్బంది వరండాలోనే విధులు నిర్వహిస్తున్నారు. లోపల హాలు ఒక గది ఉన్నాయి ఇందులో రికార్డు రూమ్ గా గదిని వినియోగిస్తున్నారు. హాల్లో సగం కంప్యూటర్, మరికొంత భాగం ఎస్ఐ రూమ్ గా కేటాయించుకున్నారు. నిందితులను అరెస్టు చేశాక కోర్టుకు హాజరు పరచాల్సి ఉంది. ఈ క్రమంలో కొన్ని గంటలు వారిని అదుపులో ఉంచుకుని లాకప్ లో పెట్టాలి. కానిస్టేషన్లో లాకప్ గది లేదు. కొన్ని సందర్భాల్లో రాస్తారోకోలు, ఆందోళనలు, ఘర్షణలు జరిగినప్పుడు ఎక్కువ మందిని అదుపులోనికి తీసుకుని స్టేషన్లో పెట్టవలసి ఉంది. అలాంటి సమయంలో సరిపడా స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిందితుల్లో మహిళలు ఉంటే వారిని కోర్టులో హాజరు పరిచే వరకు మహిళా సిబ్బంది రక్షణగా ఉండాలి, వారికి ప్రత్యేక గది వంటివి లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. కేసులకు సంబంధించి దస్త్రాలను గోపియంగా దాచవలసి అవసరం ఉంది. వాటిని భద్రపరిచేందుకు సిబ్బందికి చుక్కలు కనిపిస్తున్నాయి.

ఆ భవనం పైనే ఆశలు..!

ప్రస్తుతం స్టేషన్ నిర్వహిస్తున్న భవనం పూర్తిగా పాడయింది. గోడలు పీటలు తీసి ప్రమాదంగా మారాయి. స్లాబు సైతం దెబ్బతింది. ఈ పరిస్థితుల్లో అక్కడ విధులు నిర్వహణ కత్తి మీద స్వాముల మారింది. దీంతో ప్రత్యామ్నాయ భవనం కోసం పోలీసులు అన్వేషణ చేస్తున్నారు. మండల పరిషత్ సమావేశాలు నిర్వహణకు నిర్వహించిన భవనం అనువుగా ఉందని గుర్తించారు. భవనంలోనికి పోలీస్ స్టేషన్ మార్చవచ్చునని భావిస్తున్నారు. ప్రజలకు నిరంతరం రక్షణ కల్పించే పోలీస్ శాఖ వారికి నూతన భవనం సమకూర్చే విధంగా ప్రజా ప్రతినిధులు, పోలీస్ అధికారులు సారవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

మూలమలుపు... మృత్యు పిలుపు

విశాలాంధ్ర-పోడూరు: మండలంలోని వేడంగి వద్ద నరసాపురం నిడదవోలు ప్రధాన కాలువపై నిర్మించిన కొత్త వంతెన వేడంగి గ్రామ ప్రజలకే కాకుండా పరిసర గ్రామాల ప్రజలందరికీ ఈ వంతెన దగ్గర దారిగా వివిధ ప్రాంతాలకు వెళ్ళటానికి ఎంతగానో ఉపయోగపడు తున్నది. మోటార్ బైక్‌లతో పాటు స్కూల్ బస్సులు, కొబ్బరికాయల లారీలు, ట్రాక్టర్లు, కార్లు వంటి ఎన్నో వాహనాలు వివిధ గ్రామాలకు ఈ వంతెన మీదుగా నిత్యం వెళుతుంటాయి. వేడంగి పాలెం మట్టపర్రు, పెనుమదం తదితర గ్రామాల ప్రజలు నిత్యం ఈ వంతెన మీదుగా ప్రయాణిస్తుంటారు. ఈ వంతెన అప్రోచ్ రోడ్డు మార్టేరు -పాలకొల్లు అర్ అండ్ బి రోడ్డు కు కలుస్తుంది. ఇక్కడ వంతెన అప్రోచ్ రోడ్డు ఉన్నట్లు హెచ్చరిక బోర్డు గాని ఎటువంటి గుర్తులు లేకపోవడంతో పాలకొల్లు మార్టేరు రోడ్డు పై వెళ్లే లారీలు బస్సులు వాహనాలు వేగంగా వెళుతుంటాయి. వంతెన దిగి రోడ్డు ఎక్కవలసిన వాహనదారులు ఆగి వేచి చూసి రోడ్డు దాటవలసి వస్తున్నది. వంతెన దిగి రోడ్డుకు చేరే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎటువంటి పెద్ద ప్రమాదాలు చోటు చేసుకోక ముందే హెచ్చరిక బోర్డులను, తగిన గుర్తులను ఏర్పాటు చేయ్యాలని స్థానికులు కోరుతున్నారు.

మణిపూర్ దోషులకు శిక్షించాలి

విశాలాంధ్ర-కాళ్ళ: రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ మణిపూర్ లో సభ్య సమాజం సిగ్గుపడేలా, యావత్ భారతదేశం తలదించుకునేలా మహిళలపై చేసిన ఘోరమైన, హేయమైన చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. సీసలి గ్రామంలో ఆదివారం ఎస్ సి,ఎస్ టి,బిసి, మైనారిటీ బహుజన సమాఖ్య సమావేశం అధ్యక్షులు సోద దాసి గంగయ్య అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ సేవ కార్యక్రమంలో కాదు జాతి గౌరవాన్ని కోసం పనిచెయ్యాలన్నారు. పెత్తం దార్లు, కుల నిర్మూలన కోసం పోరాటం, రాజకీయ చైతన్యం రావాలన్నారు. మత చాందస వాదుల వికృత శ్రేష్ఠలు నానాటికి పెచ్చరిల్లి పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఒక సైనికుడు తన భార్య ను రక్షించుకోలేని స్థితికి దేశం దిగజారిపోయిందని దీనికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనియన్ సివిల్ కోడ్‌ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్రీని పూజించే ఈ దేశంలో ఇలా జరగడం చాలా బాధాకరమని దీనికి వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో దేశమంతా పోరాటం చేస్తామని హెచ్చరించారు. మైతి శ్రీనివాస్, మత్తే రాజ్ కుమార్ ,డి.వి.కె.ప్రకేశ్, రాము, జాకబ్, సందీప్, కోన రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్-కం-రైల్ వంతెనపై రవాణా నిలిపివేత

విశాలాంధ్ర బ్యూరో-రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం కొవ్వూరు ను అనుసంధానం చేస్తూ అందుబాటులో ఉన్న రోడ్ కం రైల్ వంతెన పై ఆదివారం నుంచి లారీలు, బస్సుల ట్రాఫిక్ ను నిలిపి వేసినట్లు జిల్లా కలెక్టర్ డా కె మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్ కం రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయిన తరువాత 1974 నుంచి వాహనాల రాకపోకలు సాగించడానికి అనుమతించడం జరిగిందన్నారు. ఆ సమయంలో ఈ బ్రిడ్జి జీవిత కాలం 65 ఏళ్లుగా నిర్ణయించడం జరిగింది. ఈ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చి 49 సంవత్సరాలు పూర్తి అవుతున్నది. రోజురోజుకు విపరీతమైన ట్రాఫిక్ పెరుగుతున్న వర్తమాన సంఘటనలు నేపథ్యంలో, ఈ వంతెనపై భారీ లోడుతో కూడిన వాహనాలు నడపడం వల్ల, డెక్ జాయింట్‌లపై ఉన్న ప్రాంతాల్లో దెబ్బతింటున్న దృష్ట్యా , ట్రాఫిక్ రద్దీ మరియు వంతెన యొక్క భద్రత దృష్ట్యా ఆర్ అండ్ బి అధికారులు చేసిన సూచనలు మేరకు లారీ లు, బస్సులు లకు ఈ వంతెన మార్గం ద్వారా తిరగటాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ వంతెన మనుగడ, మరిన్ని సంవత్సరాల పాటు ప్రజలకు అందుబాటులో ఉండే విధానంలో భాగంగా టూ వీలర్స్, మూడు చక్రాల వాహనాలు, కార్లు తిరిగేందుకు ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయడం జరుగుతుందని మాధవీలత పేర్కొన్నారు. ఈ వంతెన మీదుగా 10.2 టన్నుల బరువు మించి ఉన్న వాహనాలు తిరిగితే వంతెన దెబ్బ తినే అవకాశం ఉందని 2007,2011 లో నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ దృష్ట్యా ప్రజలు సహకరించాలని కోరారు. అనుమతించిన వాహనాలు వంతెన మీద తిరిగేలా మధ్యలో పోల్స్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. తుర్పు గోదావరి జిల్లా కి చెందిన సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, , జిల్లా రవాణా అధికారి, జిల్లా ప్రజా రవాణా అధికారి (ఆర్టీసీ) వారికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. కొవ్వూరు - రాజమహేంద్రవరం మీదుగా ప్రయాణం చేసే భారీ వాహన దారులు , బస్సులు జాతీయ రహదారి మీద ఉన్న నాలుగు లైనుల వంతెన గామన్ బ్రిడ్జి (4వ వంతెన) మీదుగా రాకపోకలు సాగించవలసి ఉంటుందని కలెక్టర్ తెలియచేశారు.

నిరూపయోగంగా పాఠశాల క్రీడా మైదానం

విశాలాంధ్ర-పెరవలి: చిన్నతనం నుండి విద్యతోపాటు క్రీడాలపై కూడా ఆశక్తి చూపాలని పాఠశాలలో అనేకరకాల క్రీడలపై శిక్షణ అందించడం జరుగుతుంది. మండలంలో గల కానూరు జిల్లాపరిషత్ పాఠశాలకు క్రీడామైదాణం మెండుగాఉంది. ఈక్రీడాప్రాంగణం నిరూపయోగంగా ఉండటం వలన విద్యార్థులు క్రీడలకొరకు ఉపయోగించుకోవడానికి వీలులేకుండాఉంది. గతంలో ఈపాఠశాలనుండి అనేకమంది విద్యార్థులు క్రీడలలఎంతో ముందంజలో ఉన్నసందర్భాలు ఉన్నాయి. జిల్లా రాష్ట స్థాయి క్రీడా పోటీలలో ఇక్కడి విద్యార్థులు పాల్గొన్న సందర్భాలు ఉన్నాయి. అధికారులు పాలకులు ఈవిషయాన్ని గుర్తించి పాఠశాల క్రీడా మైదానాన్ని ఉపయోగకరంగా ఉండేవిదంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భౌభౌలు...బాబోయ్ భౌభౌలు

విశాలాంధ్ర-రాజానగరం: మండల కేంద్రమైన రాజానగరంలో పశువులు బెడద రోజు రోజుకి పెరిగిపోతున్న పంచాయతీ అధికారులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. స్థానిక అగ్రహారం, ఐఓబీ బ్యాంకు కూడలి, ఏడీబి రోడ్డు, తదితర ప్రాంతాల్లో శునకాలు స్వైరవిహారం చేస్తూ అటు చిన్న పిల్లలు ఇటు పెద్దలు పై దాడులు చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ అటుగా వెళ్తున్న వారిని భయానికి గురిచేస్తూనాయి. కుక్క కాటుకు గురైన బాధితులు రాజానగరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి లైన్లు కడుతున్నారు. తమ పీ.హెచ్.సి వచ్చే రోగుల్లో అధిక కేసులు కుక్క కాటుకు గురైన వారే ఎక్కువ వస్తారని సిబ్బంది వాపోయారు. మరోపక్క కోతులు ఇళ్లలోకి చొరబడి నిత్యావసర వస్తువులు పట్టుకుపోవడంతో పాటు భయంకర శబ్దాలు చేస్తూ అందర్నీ హడలేతిస్తున్నయి. వాటిలో అవే దెబ్బలడుకుంటు గ్రామాన్ని కిష్కిందకాండగా మారుస్తున్నాయి. వాటిని బెదిరించేందుకు వెళ్లే వారిపై తిరగబడుతున్నాయి. అదేవిధంగా పశువులు రోడ్లు పై సంచరిస్తూ ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నాయి. అలాగే రాజానగరం బస్టాండ్లో, సంత మార్కెట్ రోజుల్లో ప్రయాణికులను, కొనుగోలుదారుల సామగ్రి, వస్తువులు నాశనం చేస్తూ ఇబ్బందులు గురిచేస్తున్నాయి. మరో పక్క పందులుసంచారం కూడా అధికంగానే ఉంది. ఓ పక్క విషజ్వరాలు, అంటు వ్యాధులు సోకుతున్న నేపథ్యంలో పశువులు సంచారం పై అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని ,కోతుల్ని, కుక్కలను కూడా నిర్మోలించాలని పలువురు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

సింహగర్జన సభకు భారీగా జనం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి గొంప శివకుమార్ యాదవ్ సారధ్యంలో గుంటూరులో నిర్వహించిన ప్రజా సింహ గర్జన సభకు జనం భారీ ఎత్తున తరలి వెళ్లారు. ఆ సభలో పారిశ్రామిక వేత్త బోడె రామచంద్రయ్య యాదవ్ ఒక రాజకీయ పార్టీని ప్రకటించారు. ఈ సందర్భంగా శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ బోడె రామచంద్రయ్య యాదవ్ సారధ్యంలో స్థాపించిన ఈ పార్టీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుం దన్నారు. ఆయన్ను ముఖ్యమంత్రి చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. నైదాన రఘు, సారిపల్లి రమేష్, కుసరాజు, ఇసరపు సురేష్, కుండల శ్రీను, ఉరుకుట్టి శివ దుర్గ, తదితరులు భారీ ఎత్తున సభకు తరలి వెళ్లారు.

ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-తాళ్లపూడి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం లో కాళ్ళు విరిగి రాజమండ్రిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాళ్లపూడి గ్రామస్థుడు షేక్ సలీం వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 5 వేల రూపాయల ఆర్థికసాయం అంద జేసినట్లు తాళ్లపూడి మండల శాఖ మానవత అధ్యక్షులు సాయన సుబ్బారావు తెలిపారు. కష్టాలు, బాధలు ఉన్నచోట మానవత ఉంటుందని, వీరిని ఆదుకోవడంలో సంస్థ ముందుంటుందని తెలిపారు.

తహసీల్దారు సమక్షంలో నాయకుల దుర్భాషలు

విశాలాంధ్ర-ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం మండలం కూనవరం సచివాలయం వద్ద ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు ఇంటింటికి బిఎల్‌వోలు సర్వేలో భాగంగా బూత్ ఏజెంట్ మరియు బూత్ ఆఫీసర్ కూనవరం సచివాలయంలో 215 స్థానిక విఆర్ఓ శ్రీనివాస్ బిఎల్ఓ ఉండగా మరియు బూత్ ఏజెంట్‌కు సమాచారం ఇవ్వకుండా బిఎల్ఓ వాలంటరీ సర్వేకు చేస్తుండగా అటుగా వెళుతున్న మాజీ సర్పంచ్ పండు వెంకటేశ్వరరావు చూసి బూత్ ఏజెంట్ లేకుండా ఎలా సర్వేలు చేస్తున్నారని బిఎల్ఓ శ్రీనివాస్‌ను అడగగా దురుసుగా మర్చిపోయానని తెలపడంతో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఆనందరావుకి విషయం తెలుపగా తెలుగుదేశం నాయకులు మాజీ ఎమ్మెల్యే ఆనందరావు ఎమ్మార్వోని కలిసి ఫిర్యాదు చేయడమైనదని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కూనవరం సచివాలయం నందు విచారణ కొరకు తాసిల్దార్ జె వెంకటేశ్వరి ఫిర్యాదు దారుడు పండు వెంకటేశ్వరావుని వీఆర్వోని వాలంటరీని ముగ్గురు దగ్గర స్టేట్మెంట్ తీసుకొనె క్రమంలో సచివాలయం సిబ్బంది సమక్షంలో వైయస్సార్ అధికార పార్టీ ఎంపీటీసీ భర్త కాట్రు కృష్ణ గ్రామ కమిటీ ప్రెసిడెంట్ ఆకు చిన్ని కలిసి స్టేట్మెంట్ తీసుకునే సమయంలో ఎమ్మార్వో సమక్షంలో స్త్రీ అని కూడా చూడకుండా అధికార పార్టీ నాయకులు నానా దుర్భసలాడి మీరు వచ్చారు కదా ఎంక్వయిరీ ఆఫీసర్ని ఏం రాసుకుంటారు రాసుకోండి మేము చూసుకుంటాం అధికార పార్టీలో ఉన్నాం నాన్న దుర్భషలాడంతొ స్థానిక సర్పంచ్ భర్త వాకపల్లి సత్యనారాయణ కలగజేసుకొని ఇక్కడ జరిగేది వేరు మీరు మాట్లాడేది వేరని ఏం చేసుకుంటారో చేసుకోండని కేకలు వేసుకోవడంతో విచారణ పూర్తయిందని తెలిపారు. కోసమెరుపు విఆర్ఓ శ్రీనివాస్ సస్పెండ్ అవడానికి వీరే కారణం అని చర్చించుకోవడం అధికార పార్టీలో ఉండి ఇలాగా నానా దుర్భషలాడితే మామూలు జనాల పరిస్థితి ఏంటి అని మాకు న్యాయం ఎక్కడ జరుగుతుందని చర్చించుకోవడం కోస మెరుపు.

కాకినాడలో ముజిగల్ మ్యూజిక్ అకాడమీ

విశాలాంధ్ర-కాకినాడ: భారతదేశపు అతిపెద్ద మ్యూజిక్ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్, ముజిగల్ తమ 7వ అత్యాధునిక సంగీత అకాడమీని కాకినాడ (ఆంధ్రప్రదేశ్)లో ప్రారంభించింది. ఈ కేంద్రాన్ని కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగ గీత, కాకినాడ స్మార్ట్ సిటీ ఎంఎల్ఏ డి చంద్రశేఖర్ రెడ్డి, సరిగమ తెలుగు సీజన్ 13 విజేత, గాయకుడు యశస్వి కొండేపూడిటీ ముజిగల్ ఫౌండర్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఏలూరి ప్రారంభించారు. దాదాపు 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న అకాడమీ సాటిలేని సౌకర్యాలు కలిగి ఉంది. ఇది గాత్రం మరియు వాయిద్యంతో సహా సంగీతం నేర్చుకోవడానికి అత్యంత అనుకూలమైనది. దాదాపు 500 మంది విద్యార్థులకు పలు బ్యాచ్‌లుగా బోధన చేసే సౌకర్యాలు కలిగిన కాకినాడలోని ఈ మ్యూజిక్‌అకాడమీలో పియానో, కీబోర్డ్, గిటార్, డ్రమ్స్, కర్నాటిక్‌వోకల్స్, హిందుస్తానీ వోకల్స్, వెస్ట్రన్ వోకల్స్‌లో బోధన చేస్తారు. ఈ మ్యూజిక్ అకాడమీ ప్రారంభం తరువాత, తొలి నెలరోజులూ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఒక నెల పూర్తి ఉచితంగా సంగీత విద్యను అందించనున్నారు.

కోడి వ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనం సీజ్

విశాలాంధ్ర-భీమడోలు: కోడి వ్యర్థాలు రవాణా చేస్తున్న వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. నిడమర్రు మండలం తొకలపల్లి గ్రామానికి చెందిన జల్లూరి వెంకటరమణ అనే వ్యక్తి తన టాటా ఇంట్రా మినీ వ్యాన్‌పై డ్రైవర్ అయిన బలే సూర్యనారాయణ అనే వ్యక్తితో కలసి రాజమండ్రి టౌన్, పరిసర ప్రాంతాల్లోనీ వివిధ చికెన్ షాప్‌ల నుంచి సుమారు రెండు టన్నుల కోడి మాంసపు వ్యర్థాలను సేకరించి ఆగడాల లంక కొల్లేరు పరిసర ప్రాంతాల్లో సాగు అవుతున్న చేపల చెరువులకు మేత నిమిత్తం రవాణా చేస్తుండగా భీమడోలు శివారు రైల్వే గేటు సమీపంలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి వ్యాన్ ను సీజ్ చేసినట్లు తెలిపారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-ఏలూరు: రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు వైభవ్ జువెలరీస్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 20 మంది షోరూం సిబ్బంది రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. వైభవ్ జువెలరీస్ అధినేత గ్రంధి అమరేంద్ర రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ వైభవ్ జువెలరీస్ సిబ్బంది రక్తదానం చేయడానికి ప్రేరేపించి, రక్తదానం చేసేలా ప్రోత్సహించినందుకు గ్రంధి అమరేంద్రకు రెడ్‌క్రాస్ తరపున అభినందనలు తెలియజేశారు. డాక్టర్ ఆర్ఎస్ఆర్కే వరప్రసాదరావు, పిఆర్ఓ కేవి రమణ, వైభవ్ జ్యువెలరీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

విశాలాంధ్ర-కలిదిండి: టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని పార్టీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు అన్నారు. ఆదివారం మండలంలోని పడమటి పాలెం గ్రామంలో టిడిపి పార్టీ కార్యకర్త మాచవరపు. మస్తాన్ మృతి చెందడంతో వారి కుటుంబానికి రూ 10, వేలు ఆర్థిక సహాయం గ్రామస్తులతో కలిసి అందజేశారు. టీడీపీకి మస్తాన్ అనేక సేవలు అందించారన్నారు. ఆయన లేకపోవడం పార్టీకి తీరని లోటు అని అన్నారు. మస్తాన్ కుటుంబానికి పార్టీ భరోసాగా ఆర్థిక సహాయం అందజేశామన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభనేని. శ్రీనివాస చౌదరి, టిడిపి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: ఉచిత మెగా వైద్య శిబిరంలో 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు రాజవరం గ్రామపంచాయతీ సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య పేర్కొన్నారు. రాజవరం గ్రామంలో ఆదివారం బెతెస్త ప్రార్థన మందిరం ఆవరణలో బెతస్తా ట్రస్ట్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం నిర్మల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సారథ్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు గుండె, కిడ్నీ, గర్భిణీ స్త్రీలకు, బీపీ, షుగర్, చెవి, ముక్కు, గొంతు అన్ని రకాల వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి 500మందికి మందులు పంపిణీ చేయడం జరిగిందని తుక్కయ్య తెలిపారు. వైద్యులు బిందు, గిరిజ, వంకదారి వెంకట సత్య సాగర్, వరప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మి, ట్రస్ట్ అధ్యక్షులు కే జకాబ్, విజయ్ దేవరాజు, మాజీ సర్పంచ్ పాముల నాగమునిస్వామి, ఉపసర్పంచ్ అనంతల సుబ్బారావు, తమిర్చి బ్రహ్మయ్య, శ్రీరంగ నిలయం కాశీ విశ్వనాథ్, గిరిబాబు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకకు పర్వతనేని

విశాలాంధ్ర-చాట్రాయి: టీడీపీకి చెందిన కాసగాని చెన్నకేశవ రావు నాగమణి దంపతుల కుమారుడు మిధున్ శ్రీరామ్ అన్నప్రాసన వేడుకకు నూజివీడు నియోజకవర్గ నాయకులు పర్వతనేని గంగాధర్ హాజరై చిరంజీవిని ఆశీర్వదించారు. ఆదివారం పుట్రెల మారెమ్మ అమ్మ వారి సన్నిధిలో జరిగిన వేడుకలో నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పర్వతనేని గంగాధర్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షులు ఈడ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డిమాజీ ఎంపీపీ కందుల కృష్ణ, పుచ్చకాయల సత్యనారాయణరెడ్డి, పుచ్చకాయల సీతారామిరెడ్డి, పలగాని లక్ష్మీనారాయణ, బోంతు సతీష్, ఈదర సర్పంచ్ దొండపాటి ఏసుపాదం, తెలుగు రైతు మాజీ అధ్యక్షులు అక్కినేని చందు, వైసీపీ నాయకులు హాజరయ్యారు.

చినతాడేపల్లిలో ఉచిత హోమియో వైద్య శిబిరం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం రూరల్: మానవత దృక్పదంతో నిరుపేదలకు వైద్య సహకారం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వైద్య శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చినతాడేపల్లి గ్రామ సర్పంచ్ పిచ్చుకల రాజారావు అన్నారు. ఆదివారం విశ్వ మానత సేవా సంస్థ అధ్వర్యంలో బిపి, షుగర్, కీళ్ళ వ్యాధులు, నడుం నొప్పి, గుండె, మానసిక, కిడ్నీ, శ్వాసకోశ తదితర వ్యాధులకు సంబంధించి ఏర్పాటు చేసిన ఉచిత హోమియో వైద్య శిభిరాన్ని ఆయన ప్రారంభించారు. రాజారావు మాట్లాడుతూ ఆర్థిక వ్యయాన్ని వెచ్చించి ప్రజా ఆరోగ్య పరిరక్షణకు గ్రామాల్లో వైద్య సహకారం అందించేందుకు ఏర్పాటు చేసిన శిభిరాలను ప్రజలు వినియోగించుకుని ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. హోమియో వైద్యం అనుసరించడం ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు మారిన వాతావరణ పరిస్థితులు దృష్టిలో ఉంచుకుని కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని సూచించారు. నివాస ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం హోమియో వైద్యులు నిమ్మల రామారావు ఆధ్వర్యంలో సుమారు 61 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 1న మెగా వైద్య శిబిరం



విశాలాంధ్ర-అనపర్తి: నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ ఆధ్వర్యంలో టిడిపి వ్యవస్థాపక సభ్యులు స్వర్గీయ నల్లమిల్లి మూలారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆగస్టు 1వ తేదీన మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం రామవరం లో నల్లమిల్లి విలేకరులతో మాట్లాడుతూ పొలమూరు శ్రీదేవి ఫంక్షన్ హాల్లో జిఎస్ఎల్ మెడికల్ కాలేజ్ (రాజానగరం), ఎన్టీఆర్ ట్రస్ట్ (హైదరాబాద్) ఐఎంఏ అనపర్తి శాఖ, రాజమహేంద్రవరం, అనపర్తి డ్రగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గుండె సంబంధిత నిపుణులు, జనరల్ ఫిజీషియన్స్, ఎముకలు కీలు శస్త్ర చికిత్స నిపుణులు, జనరల్ సర్జరీ విభాగం, కంటి, డెంటల్, గైనకాలజీ, క్యాన్సర్ కు సంబంధించిన రక్త పరీక్షలు వంటి వివిధ విభాగాలకు సంబంధించిన వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొంటారని నల్లమిల్లి చెప్పారు. రాజమహేంద్రవరం అనపర్తి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు ప్రెస్క్రైబ్ చేసిన మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా పేషెంట్స్ అందరికీ ఉచిత భోజనం ఏర్పాట్లు చేస్తున్నట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు సిరసపల్లి నాగేశ్వరరావు, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామారెడ్డి, జిల్లా సాంస్కృతిక విభాగ అధ్యక్షులు సత్తి దేవదాన రెడ్డి, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు తేనెల శ్రీను తదితరులు ఉన్నారు.